సాక్షి
అనంతపురం
శుక్రవారం । 18 । ఆగస్టు । 2023



టన్ను చీనీ రూ.18,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18,500 పలికాయి.



కిలో టమాటా @ రూ.37

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్ట ధర రూ.37 మేర పలికింది. మార్కెట్‌కు 3,600 టన్నులు అమ్మకానికి వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
37.6°/22.8°


జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో గాలి వీచింది.

చిరుతకు కాలగండం

- ఉమ్మడి జిల్లాలో వరుసగా మృత్యువాత
- నైరుతి రుతుపవనాల కాలంలో కలయిక కోసం పరిధి దాటుతున్న వన్యప్రాణి
- అరుదైన మృగాల మృతితో అంతటా కలవరం



చిరుత కళేబరాన్ని పరిశీలిస్తున్న అధికారులు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: మడకశిర మండలంలోని మెళవాయి సమీపంలో రెండు రోజుల క్రితం (బుధవారం) ఒక ఆడ చిరుత మృతి చెందింది. గురువారం కూడా అదే ప్రాంతంలోనే మరో మగ చిరుత విగతజీవిగా కనిపించింది. రెండు చిరుతలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాయి. కారణాలు అంతుచిక్కడం లేదు. విషాహారం తినడంతో మృతి చెందాయా? అనారోగ్యం బారిన పడి మృతి చెందాయా? లేదా వేటగాళ్ల దాడిలో మృతి చెందాయా? అనే కోణాల్లో అటవీశాఖ అధికారులు విచారణ చేస్తున్నారు.

తల్లీపిల్లని అనుమానం..

మృతి చెందిన రెండు చిరుతలు తల్లి, పిల్లగా అటవీ శాఖ అధికారులు భావిస్తున్నారు. బుధవారం మృతి చెందిన ఆడ చిరుతకు దాదాపు 32 నెలల వయసు ఉంటుందని చెబుతున్నారు. గురువారం మృతి చెందిన మగ చిరుతకు 18 నెలల వయసు ఉంటుందంటున్నారు. ఈ నేపథ్యంలో మృతి చెందిన చిరుతలు తల్లి, పిల్లగా భావిస్తున్నారు. మగ చిరుతకు ఇంకా పాల పళ్లు అలాగే ఉన్నట్లు తెలిసింది.

రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వరుసగా చిరుత పులులు మృత్యువాత పడుతుండటం విస్మయం కలిగిస్తోంది. మడకశిర నియోజకవర్గంలో రెండు రోజుల్లోనే రెండు చిరుతలు మృతి చెందిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సరిగ్గా ఏడాదిన్నర క్రితం కూడా పెనుకొండ నియోజకవర్గంలో రెండు చిరుతలు మృతి చెందాయి. ఆరు నెలల క్రితం బెంగుళూరు జాతీయ రహదారిపై సోమందేపల్లి వద్ద వాహనం ఢీకొనడంతో ఒకటి ప్రాణాలు కోల్పోయింది. వరుసగా ఇలా అరుదైన వన్య సంపదను నష్టపోతుండడంతో ఫారెస్టు అధికారుల్లోనూ ఆందోళన మొదలైంది.

కాటేస్తున్న కాలం!

సాధారణంగా చిరుతకు పరిధి ఉంటుంది. ఆ ప్రాంతంలోకి మరొక చిరుతను రానివ్వదు. అయితే, ఆగస్టు నుంచి నవంబర్ మాసాల మధ్య కాలంలో కలయిక కోసం అవి పరిధి దాటుతూ ఉంటాయి. ఈ సమయంలోనే వాటి మధ్య తీవ్ర ఘర్షణ జరుగు తుంది. ఒక్కోసారి ఆడ, మగ చిరుతలు కూడా ఘర్షణ పడుతూ ఉంటాయి. ఈ కారణంగా చిరుతలు ప్రాణాలు కోల్పోతాయని అధికారుల చెబుతున్నారు. ఒక్కోసారి బలమైన దుప్పులను వేటాడుతున్నప్పుడు వాటి కొమ్ములు తగిలి గాయాలపాలై కన్నుమూస్తామని పేర్కొంటున్నారు. మరోవైపు చిరుతలు రాత్రిళ్లలో రహదారులపైకి వచ్చినప్పుడు వాహనాల హెడ్‌లైట్ ఫోకస్‌కు ఆగిన సమయంలో అవి ఢీకొట్టి చనిపోతున్నాయి.

చిరుతలకు ఆవాసంగా ఉమ్మడి జిల్లా ..

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో చిరుతల సంతానోత్పత్తి బాగా జరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. వీటితో పాటు జింకలు, నెమళ్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగినట్టు ఫారెస్టు పరిశీలనలో వెల్లడైంది. రాయలసీమలోనే చిరుతలకు అనుకూలమైన ప్రాంతంగా ఉమ్మడి జిల్లా అడవులు పేరుపొందాయి. దీంతో వన్యప్రాణుల సంతతి పెరుగుతోందని భావిస్తున్న తరుణంలో ఒక్కో వన్యమృగం మృతి చెందుతూ ఉండడం కలవరం కలిగిస్తోంది.

విషం ఆనవాళ్లు..

మృతి చెందిన రెండు చిరుతలకు మడకశిరలోని వెటర్నరీ ఆస్పత్రిలో డాక్టర్లు పోస్టుమార్టం నిర్వహించారు. రెండు చిరుతల శరీరంలో విషం ఆనవాళ్లు ఉన్నట్లు గుర్తించారు. ఈ చిరుతలకు శరీరంపై ఎలాంటి గాయాలు కూడా లేవు. అలాగే ఎలాంటి ఆరోగ్య సమస్యలు కూడా లేవని డాక్టర్లు గుర్తించినట్లు సమాచారం. దీంతో విషాహారం తినడంతోనే చిరుతలు మృతి చెందినట్లు డాక్టర్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిసింది. అయితే పూర్తిస్థాయిలో చిరుతల మృతిని నిర్ధారించడానికి వాటి శరీర నమూనాలను బెంగళూరు ల్యాబ్‌కు పంపారు.

చిరుతలు పరిధి దాటే కాలమిది

సాధారణంగా నైరుతి రుతుపవనాల కాలంలో చిరుతలు ఒకదానితో ఒకటి కలుస్తుంటాయి. దీని కోసం తమ పరిధి దాటి వెళతాయి. ఈ క్రమంలో వేరొక చిరుతతో బాగా గొడవ పడి వాటికవే శత్రువులుగా మారి చంపేసుకుంటాయి. అందుకే ఈ సమయంలో అటవీ ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలను అడవుల్లోకి వెళ్లకూడదని హెచ్చరిస్తుంటాం. – సందీప్ కృపాకర్, జిల్లా ఫారెస్టు అధికారి, అనంతపురం

బెంగళూరు లేబొరేటరీకి నమూనాలు

మృతిచెందిన రెండు చిరుతలకు పోస్టుమార్టం నిర్వహించాం. రెండింటి శరీరాలపై ఎలాంటి గాయాలూ లేవు. అందుకే నమూనాలు బెంగుళూరులోని వెటర్నరీ లేబొరేటరీకి పంపిస్తున్నాం. ఆ ప్రక్రియ పూర్తయితే గానీ మృతికి కారణమేమనేది చెప్పలేం.

–డా.అమర్, పశువైద్యాధికారి, మడకశిర

న్యూస్‌రీల్

జిల్లాకు 633 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ కోటాలో భాగంగా క్రమం తప్పకుండా వివిధ కంపెనీల నుంచి ఎరువుల సరఫరా జరుగుతోంది. యూరియా, డీఏపీ, పొటాష్‌తో పాటు పెద్ద ఎత్తున కాంప్లెక్స్ ఎరువులు జిల్లాకు చేరుతున్నాయి. గురువారం స్మార్ట్ కెమికల్స్ కంపెనీ నుంచి (10–2626 రకం) కాంప్లెక్స్ ఎరువులు 633 మెట్రిక్ టన్నులు చేరినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ ఎం.రవి తెలిపారు. గురువారం ఆయన రాప్తాడు ఏఓ పి.వెంకటేశ్వరప్రసాద్‌తో కలిసి స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్‌కు చేరిన ఎరువులను పరిశీలించారు. ఆర్‌బీకేలతో పాటు జిల్లా వ్యాప్తంగా ఇండెంట్ ప్రకారం సరఫరా చేస్తామన్నారు. మిగతావి మార్క్‌ఫెడ్, కంపెనీ గోదాముల్లో నిల్వ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పల్లె ప్రజల చెంతకే వైద్యం



గ్రామంలో పర్యటిస్తున్న డీఎంహెచ్‌ఓ యుగంధర్

ఆత్మకూరు: పల్లె ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా ఇంటి వద్దనే వైద్య సేవ లందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఫ్యామిలీ డాక్టర్' విధానానికి శ్రీకారం చుట్టిందని డీఎంహెచ్‌ఓ యుగంధర్ తెలిపారు. మండలంలోని మదిగుబ్బ గ్రామంలో గురువారం పీజీ మెడికల్ విద్యార్థులతో కలిసి ఆయన పర్యటించారు. స్థానికులతో మాట్లాడారు. వైద్య సిబ్బందితో మాట్లాడుతూ బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులను క్రమం తప్పకుండా పరిశీలించాలన్నారు. ప్రతి నెలా మందులు అందించాలన్నారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ పరిశీలించారు. 'ఫ్యామిలీ డాక్టర్' జిల్లా నోడల్ అధికారి సుజాత, డాక్టర్ సబీహా సుల్తానా ఉన్నారు.

'ఈ–ఆశ'పై అవగాహన పెంచుకోవాలి

అనంతపురం క్రైం: 'ఈ–ఆశ' యాప్ ఆన్‌లైన్ సేవలపై అవగాహన పెంచుకోవాలని ఆశాలకు డీఎంహెచ్‌ఓ యుగంధర్ సూచించారు. గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని రకాల ఆరోగ్య సేవలను అప్లికేషన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మహేంద్రనాథ్, డీసీఎం శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శి కార్యాలయాల్లో సోదాలు



అనంతపురంలోని మార్గదర్శి కార్యాలయం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక బళ్లారి చౌరస్తాలోని మార్గదర్శి కార్యాలయంలో గురువారం సీబీ సీఐడీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, విజిలెన్స్, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. డిపాజిట్లను బదిలీ చేశారన్న ఆరోపణల నేపథ్యంలో మార్గదర్శి కార్యాలయాల్లో సోదాలు జరుగుతున్న విషయం పాఠకులకు తెలిసిందే. ఇప్పటి వరకూ అనంతపురం మార్గదర్శి కార్యాలయంలో మూడవ సారి అధికారుల బృందం సోదాలు చేపట్టింది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సోదాలు రాత్రి వరకూ కొనసాగాయి. కొన్ని కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు.

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం





సచివాలయ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ కోటేశ్వరరావు

- 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష' లక్ష్యమిదే
- మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ కోటేశ్వర రావు

అనంతపురం క్రైం: చాలా ఏళ్లుగా నెలకొన్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష'కు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ కోటేశ్వర రావు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని సచివాలయాల అడ్మిన్, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ కార్యదర్శులకు గురువారం నగర శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో రీ సర్వేపై వర్క్‌షాపు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో డ్రోన్ సర్వే పూర్తయిందన్నారు. ప్రతి స్థలానికి వచ్చే ఏడాది మార్చిలోపు భూ హక్కు పత్రాన్ని అందిస్తామన్నారు. వందేళ్ల తర్వాత చేపడుతున్న రీ సర్వేను విజయవంతం చేసేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే 96 యూఎల్‌బీలలో డ్రోన్ ఫ్లై ప్రక్రియ పూర్తవగా, 56 యూఎల్‌బీలకు మ్యాప్‌లు కూడా వచ్చాయని వెల్లడించారు. ఇటీవల వర్షాల కారణంగా డ్రోన్ సర్వేకి కొంత అంతరాయం కల్గిందని పేర్కొన్నారు. అనంతరం 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష' పథకంలోని 23 అంశాలపై స్పెషలాఫీసర్ సుబ్బారావుతో కలిసి ఆయన అవగాహన కల్పించారు. పురోగతి సాధించడానికి తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. స్థల యజమానికి, ప్రభుత్వ స్థలాలకు సంబంధించి ఫాం 14 నోటీసు తప్పక అందజేయాలని ఆదేశించారు. సర్వే కచ్చితంగా చేయాల్సిందేనని, ఎవరూ తప్పించుకునేందుకు ఆస్కారం ఉండదన్నారు. అంకితభావంతో పని చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ రానున్న రోజుల్లో రీ సర్వేను మరింత వేగవంతం చేయాలన్నారు. అర్బన్ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా రికార్డులు చూసుకుని క్షేత్రస్థాయిలో నిజనిర్ధారణ చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి, నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, వివిధ మున్సిపాలిటీల కమిషనర్లు మల్లికార్జున, రవి, దివాకర్‌రెడ్డి, శ్రీనివాస రావు, వెంకటేశులు, ప్రమోద్ కుమార్, నగరపాలక సంస్థ ఎస్‌ఈ నాగమోహన్, ఆర్‌ఓ సతీష్, సుజాత, ఏసీపీ బాలాజీ, టీపీఓ శిరీష, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాంజలి, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్‌–1లో మెరిసిన జిల్లావాసులు



భవాని



రామచంద్రవరుణ్

అనంతపురం: ఏపీపీఎస్సీ గ్రూప్‌–1 ఫలితాల్లో జిల్లా వాసులు సత్తా చాటారు. గురువారం విడుదలైన ఈ ఫలితాల్లో జిల్లాకు చెందిన భూమి రెడ్డి భవానీ రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకుతో మెరిశారు. జేఎన్‌టీయూ (ఏ)లో ఇంజినీరింగ్ పూర్తి చేసిన కే. ప్రవీణ్ కుమార్ రెడ్డి నాలుగో ర్యాంకు దక్కించుకుని పలువురితో శభాష్ అనిపించుకున్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని గ్రామీణాభివృద్ధి విభాగంలో పరిశోధన చేస్తున్న దానం జ్ఞానానంద రెడ్డి గ్రూప్‌–1లో ర్యాంకు సాధించి అసిస్టెంట్ కమిషనర్ స్టేట్ ట్యాక్స్ (గతంలో సీటీఓ) ఉద్యోగం దక్కించుకున్నారు.

ఇకపై డీఎస్పీ భవాని..

కదిరి: తలుపుల మండలం గంజివారిపల్లికి చెందిన టి.భవాని డీఎస్పీగా ఎంపికయ్యారు. భవాని ప్రస్తుతం వైఎస్సార్ జిల్లా చాపాడు మండలంలో డిప్యూటి తహసీల్దార్‌గా పని చేస్తున్నారు. అంతకు మునుపు గ్రూప్‌–2లో ఎంపికై వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లో కూడా పని చేశారు. భవాని భర్త విశ్వనాథ్ వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్లలోని రాయలసీమ థర్మల్ విద్యుత్ ఉత్పాదన సంస్థలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. తల్లి కె.తులసి గృహిణి కాగా తండ్రి చెన్నకృష్ణ కదిరిలో ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. తమ కుమార్తె డీఎస్పీగా ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా ఆమెను గంజివారిపల్లికి చెందిన వీఆర్‌ఓ నరసింహారెడ్డి, మరికొందరు స్థానికులు అభినందించారు.

ఎంపీడీఓ కుమారుడు..

బెళుగుప్ప ఎంపీడీఓ గాజుల శ్రీరాములు, లక్ష్మి దంపతుల కుమారుడు గాజుల రామచంద్రవరుణ్ గ్రూప్‌–1 ఫలితాల్లో సత్తా చాటి ఎంపీడీఓగా ఎంపికయ్యారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన ప్రిలిమ్స్‌కు హాజరై అర్హత సాధించారు. జూన్‌లో జరిగిన మెయిన్స్‌లో ప్రతిభ చూపి ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. విజయవాడలో ఆగస్టు 3న జరిగిన ఇంటర్వ్యూల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. గురువారం సాయంత్రం విడుదలైన మెయిన్స్ ఫలితాల్లో ఎంపీడీఓగా ఎంపికయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రూప్‌–1లో 110 పోస్టులు ఉండగా, 16 ఎంపీడీఓ పోస్టులు ఉన్నాయి. ఇందులో గాజుల రామచంద్ర వరుణ్ ఎంపిక కావడం గమనార్హం.

నాన్న స్ఫూర్తితోనే



ఎన్‌పీ కుంట మండలం, మద్దికొమ్మ దిన్నె మా స్వగ్రామం. నాన్న వీఆర్వోగా పనిచేస్తున్న సమయంలోనే గ్రూప్‌–1 సాధించాలనే లక్ష్యం నిర్దేశించుకున్నా. అమ్మ అరుణ కుమారి అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్నారు. గ్రూప్‌–1 అధికారి కావాలనే నాన్న కల నన్ను ఇంత వరకు నడిపించింది. కానీ ఆ కల నెరవేరే సమయానికి ఆయన లేరనే బాధ ఉంది. నా భార్య రవళి గ్రూప్‌–1కు సన్నద్ధమవుతున్నారు. ఎస్కేయూలో రూరల్ డెవలప్‌మెంట్ విభాగంలో పీహెచ్‌డీ అడ్మిషన్ పొందడమే నాకు జీవితంలో ఒక మలుపు లాంటిది. అక్కడ పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యే అభ్యర్థులే నాకు స్ఫూర్తి.

– జ్ఞానానంద రెడ్డి, ర్యాంకర్

పంచాయతీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లాలో ఈ నెల 19న జరగనున్న పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ కె. శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఒక సర్పంచు, 11 వార్డు మెంబర్ల స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట దాకా పోలింగ్ ఉంటుందని, కౌంటింగ్ కూడా అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాగనుందని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అల్లర్లకు తావివ్వకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల వేళ శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు.

ఎలుగు బంటి హల్‌చల్

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం మండల పరిధిలోని దురదకుంట గ్రామంలో గురువారం ఉదయం రమేష్ అనే రైతు మొక్కజొన్న తోటలో ఎలుగుబంటి హల్‌చల్ చేసింది. భల్లూకాన్ని గుర్తించిన కూలీలు భయాందోళనతో పరుగులు తీశారు. కొద్దిసేపటికే ఎలుగుబంటి సమీప కొండల్లోకి వెళ్లిపోయింది. కొంతకాలంగా స్థానిక పొలాల్లో ఎలుగుబంటి సంచరిస్తుండడంతో రైతులు వణికిపోతున్నారు. రాత్రిళ్లు పొలాల్లోకి వెళ్లాలంటే హడలిపోతున్నారు. అటవీ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఫార్మా డీ ఇంటర్న్‌షిప్ అసెస్‌మెంట్ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో నిర్వహించిన ఫార్మా డీ ఇంటర్న్‌షిప్ అసెస్‌మెంట్ ఫలితాలు విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి గురువారం తెలిపారు. ఫలితాలను http://jntuaresults.ac.in వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

నవోదయ ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

లేపాక్షి: లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ ఎం.నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈకేవైసీ వంద శాతం పూర్తి చేయాల్సిందే



మాట్లాడుతున్న జేడీ మధుసూదన్ రావు

అనంతపురం రూరల్: వసతి గృహాల్లో విద్యార్థుల ఈకేవైసీ వంద శాతం పూర్తి చేయాల్సిందేనని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్ రావు పేర్కొన్నారు. గురువారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో హాస్టల్ వార్డెన్లు, సహాయ సంక్షేమ అధికారులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో వేర్వేరుగా ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం మెనూలో మార్పులు తీసుకొచ్చిందన్నారు. సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత వార్డెన్లపై ఉందన్నారు. వార్డెన్లు తప్పనిసరిగా స్థానికంగా నివాసం ఉండాలన్నారు. చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని ఆయన ఆదేశించారు.

కేవలం ₹ 3750 రాయితీతో
ఆఫీస్ ఆటోమేషన్ కోర్స్ (చివరి అవకాశం)
అన్ని Govt. ఉద్యోగాలకు, AP-SBTET ద్వారా Pass అయిన సర్టిఫికేట్ ఉపయోగపడును.
Qua : 10th పాస్ | Last Date : 04-09-2023 (without fine)
SAI INSTITUTE (Affiliated by Govt. of A P SBTET)
14/402, Kamalanagar, ATP. 9059723829

సీఎం జగన్ చెప్పాడంటే చేస్తాడంతే

- ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి



విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థులు, చిత్రంలో ఎమ్మెల్యే, చైర్‌పర్సన్

గుంతకల్లుటౌన్: సీఎం జగన్ చెప్పాడంటే కచ్చితంగా చేసి తీరతారని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అక్షరప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్నదే ఆయన లక్ష్యమని పేర్కొన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు గుంతకల్లుకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేసి నియోజకవర్గ ప్రజల మూడు దశాబ్దాల కలను నెరవేర్చారని కొనియాడారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ గుంతకల్లులో సుమారు 5 వేల మంది కళాశాల, హైస్కూల్ విద్యార్థులతో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైవీఆర్ మాట్లాడుతూ పేదరికంలో మగ్గిపోతున్న కుటుంబాలకు విద్యతోనే విముక్తి సాధ్యమని భావించి రాష్ట్రంలో చదువుల విప్లవానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలో చదివే విద్యార్థులు మంచి ఉపాధి అవకాశాలు పొందాలని ఆకాంక్షించారు. కళాశాల ఓఎస్‌డీ డాక్టర్ ధీరేంద్రబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే వైవీఆర్ కృషితోనే ఈ విద్యా సంవత్సరంలో కళాశాల ప్రారంభం కానుందన్నారు. 4 కోర్సుల్లో 240 సీట్లు ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, వైఎస్సార్‌ఎస్‌యూ మండల అధ్యక్షుడు వంశీయాదవ్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయాలని ఎన్నో పోరాటాలు చేసినా గత పాలకులు స్పందించలేదని తెలిపారు. కళాశాల రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు, మంజూరు చేసిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే వైవీఆర్‌ను విద్యార్థి సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవానీ, వైస్ చైర్‌పర్సన్ మైమూన్, మాజీ మున్సిపల్ చైర్మన్ రామలింగప్ప, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

గురుకుల పాఠశాల తనిఖీ



ప్రిన్సిపాల్ సునీతతో మాట్లాడుతున్న ఎంపీ రంగయ్య, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఉరవకొండ: స్థానిక శివరామిరెడ్డి కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి గురువారం తనిఖీ చేశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ప్రిన్సిపాల్ సునీతతో ఆరా తీశారు. భవనం నిర్మించి 13 ఏళ్లు కావడంతో పాటు నల్లరేగడి భూమి కావడంతో పునాదులు కుంగిపోతున్నట్లు గుర్తించారు. ఎంపీ మాట్లాడుతూ.. తన కోటా నిధులతో కొన్ని సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానన్నారు. అలాగే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ భరోసానిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహులు, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ సుశీలమ్మ, జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాల సీజ్



సీజ్ చేసిన వాహనాలు

తాడిపత్రి: అధిక లోడుతో అక్రమంగా ఇసుక తరలిస్తున్న పలు వాహనాలను సెబ్ అధికారులు సీజ్ చేశారు. అందిన సమాచారం మేరకు అనంతపురం సెబ్ సీఐలు నరసయ్యనాయుడు, శ్రీనివాసులు సిబ్బంది గురువారం తెల్లవారుజామున తాడిపత్రికి చేరుకుని స్థానిక పోలీసుల సాయంతో పలు ప్రాంతాల్లో తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో అధిక లోడుతో ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్లు, మూడు ట్రాక్టర్లతో పాటు ఆలూరు సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మరో 3 ట్రాక్టర్లను సీజ్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

విదేశీ విద్యకు మార్గం సుగమం

- జేఎన్‌టీయూ(ఏ)లో చేరితే స్వీడన్‌లో చదువుకోవచ్చు
- డ్యూయల్ డిగ్రీ విధానంపై బ్లెకింగ్ వర్సిటీతో ఒప్పందం

అనంతపురం: డాలర్ డ్రీమ్ ఇప్పటి యువత కల. ఇందు కోసం విదేశాల్లో ఉన్నత చదువులు చదివి అక్కడే స్థిరపడాలని భావిస్తోంది. ఈ కలను సాకారం చేసుకోవాలంటే పొరుగు దేశం వెళ్లి ఏదైనా కోర్సు చేయాలి. లేదా ఆ దేశం నుంచి వీసా పొందాలి. ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవాలి. ఇలాంటి వ్యయ ప్రయాసలకు చెక్ పెట్టి విదేశాల్లో ఎంఎస్ పూర్తి చేసే కలను జేఎన్‌టీయూ(ఏ) సాకారం చేస్తోంది. ఇప్పటికే స్వీడన్‌లోని బ్లెకింగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యూనివర్సిటీతో ఒప్పందం చేసుకుని పలు కోర్సుల్లో నాలుగేళ్ల డిగ్రీకి అవకాశం కల్పిస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా స్వీడన్ బ్లెకింగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో సీఎస్ఈ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, ఈసీఈ విభాగాల్లో సీట్లు భర్తీ చేస్తోంది.



జేఎన్‌టీయూ పాలక భవనం

ఈ ఏడాది 12 అడ్మిషన్లు..

జేఎన్‌టీయూ (ఏ), బ్లెకింగ్ వర్సిటీ సంయుక్తంగా అందిస్తున్న ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో 2023–24 విద్యా సంవత్సరానికి 12 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ కంప్యూటర్ సైన్సెస్‌లో 10 మంది, ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , మెషిన్ లర్నింగ్‌లో ఇద్దరు అడ్మిషన్లు పొందారు. బీటెక్ కోర్సులో మూడు సంవత్సరాలు జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్‌లోనూ, చివరి సంవత్సరం స్వీడన్‌లో పూర్తి చేయాల్సి ఉంటుంది. కోర్సు పూర్తి కాగానే డిగ్రీని జేఎన్‌టీయూ(ఏ) ప్రదానం చేస్తుంది. బీఎస్ పట్టాను బ్లెకింగ్ వర్సిటీ (స్వీడన్) అందిస్తుంది.

ఫీజులు అందుబాటులోనే..

ఇంటిగ్రేటెడ్ కోర్సులకు సంబంధించి ఫీజులు కూడా అందుబాటులో ఉండడం గమనార్హం. జేఎన్‌టీయూ(ఏ)కు ఏడాదికి రూ.1.50 లక్షలు, స్వీడన్‌లో ఏడాదికి రూ.7 లక్షల వరకు ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. ఏపీ ఈఏపీసెట్ లేదా జేఈఈలో అర్హత సాధించిన వారు అర్హులు. ఇంటర్మీడియట్ ఎంపీసీలో కనీసం 60 శాతం మార్కుల ఉత్తీర్ణత పొంది ఉండాలి.

డ్యూయల్ డిగ్రీ విధానం నచ్చింది



జేఎన్‌టీయూ (ఏ), బీటీహెచ్ సంయుక్తంగా అందిస్తున్న డ్యూయల్ డిగ్రీ విధానం నచ్చింది. దీంతో అడ్మిషన్ తీసుకున్నా. స్వీడన్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారికి విస్తృత ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రోగ్రాం బాగా దోహదం చేస్తుందని భావిస్తున్నా.

– గాయత్రి, బీటెక్ విద్యార్థి, జేఎన్‌టీయూ (ఏ)

ఫీజులో రాయితీ



సొంతంగా విదేశాల్లో ఎంఎస్ చేయాలంటే చాలా కష్టం. మనమే నేరుగా వర్సిటీలను ఎంపిక చేసుకోవాలి. వర్సిటీ తరఫున వెళితే ఫీజులో రాయితీ బాగా కలిసొస్తుంది. బీటెక్ కోర్సులో మూడేళ్లు పూర్తిగా జేఎన్‌టీయూ (ఏ)లోనే చదువుతాం. చివరి ఏడాది స్వీడన్‌కు వెళతాం.

– గ్రీష్మ, బీటెక్ విద్యార్థి, జేఎన్‌టీయూ(ఏ)

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



డ్యూయల్ డిగ్రీ విధానంతో విదేశీ వర్సిటీల్లోని బోధన, పరిశోధనలను ఇచ్చి పుచ్చుకునేందుకు వీలు కలుగుతోంది. ఒప్పందం మేరకు విదేశీ వర్సిటీనే మన విద్యార్థులకు పూర్తి సహకారం అందిస్తాయి. అంతర్జాతీయ నైపుణ్యాలు పెంపొందించడానికి ఈ తరహా బ్రాంచ్‌లు అమలులోకి తీసుకువచ్చాం. – ప్రొఫెసర్ జింకా రంగజనార్దన, వీసీ

వెన్నుపోట్లు, మోసాలే చంద్రబాబు విజన్

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

తాడిపత్రి: వెన్నుపోట్లు, కుట్రలు, మోసాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన చంద్రబాబు వాటినే తన విజన్‌గా భావిస్తుంటారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. స్థానిక ఆయన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో చంద్రబాబు విజన్ 2020 పేరుతో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్ చేస్తానంటూ ప్రజలను మోసపుచ్చారని గుర్తు చేశారు. తాజాగా విజన్ 2047 అంటూ పబ్లిసిటీ స్టంట్ మొదలు పెట్టారన్నారు. 2014 ఎన్నికలకు ముందు బాబు వస్తే జాబు అన్నారు, రైతుల రుణ మాఫీ, డ్వాక్రా మహిళల రుణమాఫీ, నిరుద్యోగ భృతి అంటూ చాటుకున్నారన్నారు. అధికారం చేపట్టిన తర్వాత ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చకుండానే ప్రజలను దగా చేశారన్నారు. కేవలం ప్రచార్భాటమే తప్ప సంక్షేమాన్ని ఎలా అమలు చేయాలో చంద్రబాబుకు తెలియదన్నారు. గోదావరి పుష్కరాల్లో తన పబ్లిసిటీ పిచ్చికి 29 మంది నిండు ప్రాణాలు బలి తీసుకున్నారన్నారు. గుంటూరు సభలో మహిళలకు చీరల పంపిణీ పేరుతో 9 మందిని పొట్టన పెట్టుకున్నారన్నారు. 14 సంవత్సరాల ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు రాష్ట్రంలో ఒక్క మెడికల్ కళాశాలను కూడా ఏర్పాటు చేయలేకపోయారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర రూపురేఖలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమూలంగా మార్చేస్తున్నారన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దారన్నారు. చేసిన మంచి పనులపై ప్రజలను చైతన్య పరుస్తూ ఓటు అభ్యర్థించే నైతిక హక్కును వైఎస్సార్‌సీపీ సొంతం చేసుకుందన్నారు. రాష్ట్రంలో 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుపొందడం ఖాయమన్నారు. అధికారంలో ఉన్నన్నీ రోజులూ దోచుకోవడమే తప్ప ప్రజలకు ఏ ఒక్క మంచినీ చేయని చంద్రబాబు, టీడీపీ నేతలకు ఓటు అడిగే హక్కు లేదన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం





హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, జేసీఎస్ కన్వీనర్లు, మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

- మంత్రి కేవీ ఉషశ్రీచరణ్
- జేసీఎస్ యాప్‌పై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

కళ్యాణదుర్గం: రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా చిత్తశుద్ధితో పనిచేయాలని సచివాలయ, జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులకు మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ స్థాయి సచివాలయ, జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులతో ఆమె సమావేశమై, మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పాలన అంటే ఏమిటో ప్రజలు తెలుసుకున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను డీబీటీ పద్ధతి ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి సీఎం వైఎస్ జగన్ జమ చేస్తున్నారన్నారు. సీఎం జగన్ సంక్షేమ పథకాలపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. అనంతరం జేసీఎస్ యాప్‌పై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి : డీఆర్‌ఎం



సిబ్బందికి సూచనలిస్తున్న డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్

గుంతకల్లు: విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉన్నప్పుడే ప్రమాదాలు నివారించగలుగుతామని రైల్వే ఉద్యోగులకు డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్ సూచించారు. గుంతకల్లు డివిజనల్‌లోని నంద్యాల–బేతంచెర్ల–డోన్ సెక్షన్లలోని రైలు మార్గంతో పాటు రైల్వేస్టేషన్లు గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సేఫ్టీ విభాగం సిబ్బందికి పలు సూచనలిచ్చారు. భద్రత విభాగంలో స్టేషన్ మాస్టర్లు, పాయింట్స్‌మెన్లు, గ్యాంగ్‌మెన్లు కీలకమన్నారు. సిగ్నల్ పాయింట్ వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది అలసత్వం వహించరాదన్నారు. తరచూ పాయింట్లను చెక్ చేస్తుండాలన్నారు. సాయంత్రం డోన్ రైల్వే జంక్షన్ ఇంజినీరింగ్ స్టాఫ్‌తో సేఫ్టీ సెమినార్ నిర్వహించారు. భద్రత పరమైన విషయంలో రాజీ లేకుండా పనిచేయాలని సూచించారు.

నేడు ఎస్కేయూలో వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అకడమిక్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి శుక్రవారం వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ మేరకు వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కృష్ణకుమారి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. విభాగాల వారీగా నిర్దేశించిన సమయాల్లో ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు.

ఇంటర్వ్యూలు ఆయా విభాగాల్లోనే నిర్వహిస్తారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఇంటర్వ్యూలకు నేరుగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలి. పీహెచ్‌డీ పూర్తి చేసి ఉండాలి. లేదా నెట్/సెట్ అర్హత సాధించి ఉండాలి.

18వ తేదీ ఇంటర్వ్యూల షెడ్యూల్ ఇలా..	
సమయం	విభాగం
ఉదయం 10 నుంచి 11 గంటలు	బయోకెమిస్ట్రీ, కెమిస్ట్రీ, సోషియాలజీ
ఉదయం 11 నుంచి 12 గంటలు	సెరికల్చర్, రూరల్‌డెవలప్‌మెంట్/ ఎంఎస్‌డబ్ల్యు, హిస్టరీ
మధ్యాహ్నం 12 నుంచి 1 గంట	కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్
మధ్యాహ్నం 2 నుంచి 3 గంట	స్టాటిస్టిక్స్, పొలిటికల్ సైన్సెస్
మధ్యాహ్నం 3 నుంచి 4 గంట	మైక్రోబయాలజీ, తెలుగు
సాయంత్రం 4 నుంచి 5 గంట	మేథమేటిక్స్, అడల్ట్ ఎడ్యుకేషన్

19వ తేదీ ఇంటర్వ్యూల షెడ్యూల్ ఇలా..	
సమయం	విభాగం
ఉదయం 10 నుంచి 11 గంటలు	పాలీమర్ సైన్స్, కామర్స్
ఉదయం 11 నుంచి 12 గంటలు	ఎంబీఏ, ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్
మధ్యాహ్నం 12 నుంచి 1 గంట	జియోగ్రఫీ, లా
మధ్యాహ్నం 2 నుంచి 3 గంట	జువాలజీ, హిందీ
మధ్యాహ్నం 3 నుంచి 4 గంట	బోటనీ, ఇన్‌స్ట్రుమెంటేషన్
సాయంత్రం 4 నుంచి 5 గంట	ఇంగ్లిష్, ఫిజికల్ ఎడ్యుకేషన్

బకాయి వసూలుకు బంధించారు

- గుంటూరు మురగన్ సిల్క్స్‌షాపు గుమస్తాను బంధించిన పట్టుచీరల వ్యాపారస్తుల సంఘం
- త్వరలో బకాయి చెల్లిస్తామన్న హామీతో విడుదల



గుమస్తా శ్రీకాంత్‌ను ప్రశ్నిస్తున్న పట్టుచీరల తయారీ వ్యాపారుల సంఘం నాయకులు

ధర్మవరం: సిల్క్స్ షాపుల యజమానులు బకాయి పడ్డ మొత్తాన్ని చెల్లించకుండా ఇబ్బందులు పెడుతుండటంతో ధర్మవరం పట్టుచీరల వ్యాపారుల సంఘం నాయకులు చర్యలకు దిగారు. నెల రోజుల క్రితం ధర్మవరం పట్టుచీరల వ్యాపారులపై విజయవాడలో 'ఆలయ సిల్క్స్' యజమాని అవినాష్‌గుప్త దాడిచేసిన విషయం తెలిసిందే. దీంతో పట్టుచీరల వ్యాపారులు అసోసియేషన్ ఏర్పాటు చేసుకుని వివిధ ప్రాంతాల్లోని సిల్క్స్ దుకాణ దారుల నుంచి బకాయిలను చట్ట ప్రకారం వసూలు చేసేందుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా దాదాపు రూ.1.50 కోట్ల బకాయి ఉన్న గుంటూరుకు చెందిన కాంచీపురం మురగన్ సిల్క్స్‌షాపు గుమస్తా శ్రీకాంత్ గురువారం ధర్మవరంలో కనిపించడంతో వ్యాపారులు అతన్ని పట్టణంలోని శమీనారాయణస్వామి ఆలయంలో బంధించారు. తమ బకాయి మొత్తం చెల్లించే వరకూ వదిలేది లేదని తేల్చిచెప్పారు. బకాయి మొత్తం చెల్లించకుండా గుమస్తా శ్రీకాంత్ ధర్మవరానికి పట్టుచీరల కోసం రావడంపై నిలదీశారు. యజమాని వంశీవర్మతో ఫోన్‌లో మాట్లాడారు. 15 రోజుల్లో బకాయి చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో గుమస్తా శ్రీకాంత్‌ను వదిలేశారు.

బొలెరో - లారీ ఢీ

- ఐదుగురికి గాయాలు



దెబ్బ తిన్న బొలెరో వాహనం

గార్లదిన్నె/పామిడి: మండలంలోని కల్లూరు సమీపంలో 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... పామిడి మండలం కొండాపురం గ్రామానికి చెందిన సునీల్‌కుమార్, జయరాముడు, నీలకంఠ, రాజు, జోడు కిష్ట గురువారం ఉదయం బొలెరో వాహనంలో నార్పల మండలం గూగూడుకు వెళ్లారు. అక్కడ కుళ్లాయి స్వామి దర్శనం చేసుకుని, కందూరు కార్యక్రమంలో భోజనం ముగించుకుని సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. కల్లూరు సమీపంలో 44వ జాతీయ రహదారిపై పెన్నానది సమీపంలో బొలెరో వేగాన్ని డ్రైవర్ నియంత్రించుకోలేక ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ఘటనలో బొలెరో నుజ్జునుజ్జైంది. అందులో ప్రయాణిస్తున్న ఐదుగురూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు కాపాడి అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. కాగా, ప్రమాదం గురించి తెలుసుకున్న ఎస్పీ శ్రీనివాసరావు నేరుగా ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదంపై ఆరా తీశారు. అనంతరం పామిడిలోని అంబేడ్కర్ సర్కిల్ వద్దకు చేరుకుని ట్రాఫిక్ నియంత్రణను పరిశీలించారు. ట్రాఫిక్ సమస్య, రోడ్డు ప్రమాదాల నియంత్రణపై స్థానిక సిబ్బందికి పలు సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదంపై గార్లదిన్నె పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

గార్లదిన్నె: గ్రామీణ ప్రాంతాల్లో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. గురువారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. క్రైమ్ రేట్ పూర్తిగా తగ్గించాలని సిబ్బందిని ఆదేశించారు.

ప్రమాదంలో యువ రైతు మృతి



బోయ హరీష్ (ఫైల్)

రాప్తాడు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువ రైతు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బెళుగుప్ప మండలం హనిమిరెడ్డిపల్లికి చెందిన బోయ హరీష్ (32) వ్యవసాయంతో జీవనం సాగిస్తున్నాడు. ఐదేళ్ల క్రితం అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లికి చెందిన శిల్పతో వివాహమైంది. మూడేళ్ల వయసున్న కుమారుడు, రెండేళ్ల వయసున్న కుమార్తె ఉన్నారు. గురువారం ఉదయం పనిపై ద్విచక్రవాహనంలో అనంతపురానికి వచ్చిన హరీష్.. పని చూసుకుని అత్తారింటికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కురుగుంట బీసీ కాలనీ వద్ద వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన ఐచర్ వాహనం ఓవర్‌టేక్ చేస్తూ హరీష్ బైకును ఢీ కొంది. ఘటనలో రోడ్డుపై పడిన హరీష్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించి, హరీష్ మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

పెండింగ్ పనులు నెలాఖరు లోపు పూర్తి చేయండి

- డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరుపై ఉద్యాన కమిషనర్ శ్రీధర్



అనంతపురం నుంచి వీసీలో పాల్గొన్న ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్, అధికారులు, డీసీఓలు

అనంతపురం అగ్రికల్చర్: డ్రిప్, స్ప్రింక్లర్లకు సంబంధించి గతేడాది మంజూరు చేసి ఇంకా మెటీరియల్ సరఫరా కానివి, మెటీరియల్ తీసుకుని ఇంకా పొలాల్లో బిగించుకోకుండా పెండింగ్‌లో ఉంచిన వాటిని గుర్తించి ఈ నెలాఖరులోపు పనులు పూర్తి చేయాలని ఏపీఎంఐపీ అధికారులను ఉద్యానశాఖ కమిషనర్ ఎస్.శ్రీధర్ ఆదేశించారు. గురువారం ఆయన గుంటూరు నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పెండింగ్ జాబితా ఎక్కువగా ఉన్నందున ఏ మాత్రం ఆలస్యం చేయకూడదన్నారు. 1,800 యూనిట్లు బిగించాల్సి ఉన్నందున ఉద్యానశాఖ అధికారుల సహకారంతో ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఆ తర్వాత పోర్టల్ క్లోజ్ అయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇక ఈ ఏడాదికి సంబంధించి జిల్లాకు 12,500 హెక్టార్ల లక్ష్యానికి గాను ప్రస్తుతానికి 3,500 హెక్టార్లకు సూక్ష్మసేద్యం పరికరాల ఏర్పాటు పూర్తయిందన్నారు. డిసెంబర్ లోపు టార్గెట్ చేరుకునేలా వేగవంతం చేయాలని పీడీ ఫిరోజ్‌ఖాన్‌ను ఆదేశించారు.

యువతి ఆత్మహత్య



మృతురాలు దివ్యశ్రీ

గుంతకల్లు: తల్లి మందలింపుతో మనస్తాపం చెందిన ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. గుంతకల్లులోని రాజేంద్ర నగర్‌లో నివాసముంటున్న ఈడిగ జయమ్మకు ఇద్దరు కుమార్తెలున్నారు. స్టేషన్ రోడ్డులో ఓ చిరు దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమార్తెకు వివాహమైంది. రెండో కుమార్తె దివ్యశ్రీ (23) పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తూ తల్లికి చేదోడుగా ఉంటోంది. మూడు రోజులుగా ఆరోగ్యం బాగాలేకపోవడంతో దివ్యశ్రీ ఇంటి పట్టునే ఉంటోంది. దీంతో బుధవారం ఉదయం తల్లి మందలించింది. పనికి పోకపోతే అప్పులు ఎలా తీర్చుకోవాలి, సంసారం ఎలా నెట్టుకురావాలంటూ మండిపడి తాను నిర్వహిస్తున్న దుకాణానికి వెళ్లింది. రాత్రి ఇంటికి చేరుకుని చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని విగత జీవిగా వేలాడుతున్న దివ్యశ్రీని చూసి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఆమె కేకలు విన్న ఇరుగుపొరుగు వారు అక్కడకు చేరుకుని ఉరికి వేలాడుతున్న దివ్యశ్రీని కిందకు దించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు సీఐ గణేష్ తెలిపారు.

హంద్రీ-నీవా కాలువలోకి దూసుకెళ్లిన ద్విచక్రవాహనం

- ముగ్గురికి తీవ్ర గాయాలు

ఉరవకొండ: ద్విచక్ర వాహనం అదుపు తప్పి హంద్రీ-నీవా కాలువలోకి దూసుకెళ్లిన ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. వజ్రకరూరు మండలం రాగులపాడు గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో 5, 6వ తరగతులు చదువుకుంటున్న శివ, తేజను పిలుచుకుని మామ తిప్పేస్వామి గురువారం ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఉరవకొండ సమీపంలోకి చేరుకుంటుండగా స్పీడ్ బ్రేకర్‌ను గమనించకుండా వేగంగా వెళ్లడంతో వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న హంద్రీ-నీవా కాలువలోకి దూసుకెళ్లింది. ఘటనలో ముగ్గురూ గాయపడ్డారు. వీరిలో శివ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అటుగా వెళుతున్న వారు వెంటనే స్పందించి క్షతగాత్రులను వెలికి తీసి, 108 అంబులెన్స్ ద్వారా ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ముగ్గురినీ అనంతపురంలోని జీజీహెచ్‌కు కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. కాగా, తీవ్రంగా గాయపడ్డ విద్యార్థుల తల్లిదండ్రులు బతుకు తెరువు కోసం వలస వెళ్లినట్లు సమాచారం.

వివాహిత హత్య కేసులో భర్త అరెస్ట్

కళ్యాణదుర్గం: భార్యను హత్య చేసిన కేసులో ఆమె భర్త నాగరాజును పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసులు వెల్లడించారు. దొడగట్ట గ్రామానికి చెందిన యల్లక్కకు ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కొంత కాలంగా యల్లక్క ప్రవర్తనపై భర్తకు అనుమానం ఎక్కువైంది. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున భార్యతో గొడవపడ్డాడు. ఆ సమయంలో ఆమెపై కట్టెలు, రాడ్‌తో దాడి చేసి హతమార్చి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. హతురాలి కుమారుడు రామాంజినేయులు ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ తేజమూర్తి సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. గురువారం ఉదయం కళ్యాణదుర్గం శివారులోని మారుతీ వే బ్రిడ్జి వద్ద తచ్చాడుతున్న నాగరాజును గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో యల్లక్కను తానే హత్య చేసినట్లు అంగీకరించడంతో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

80 శాతం సబ్సిడీతో ఉలవ, అలసంద

అనంతపురం అగ్రికల్చర్: ప్రత్యామ్నాయ విత్తన ప్రణాళికలో భాగంగా రైతులకు 80 శాతం సబ్సిడీతో ఉలవలు, అలసందలు పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. క్వింటా పూర్తి ధర రూ.10,800 కాగా అందులో 80 శాతం రూ.8,640 రాయితీ పోనూ రైతులు తమ వాటా కింద రూ.2,160 చెల్లించాల్సి ఉంటుంది. అలాగే అలసందలు క్వింటా రూ.11,500 కాగా అందులో 80 శాతం రాయితీ రూ.9,200 పోనూ రైతులు తమ వాటా కింద రూ.2,300 చెల్లించాల్సి ఉంటుంది. ఒక్క రైతుకు గరిష్టంగా 50 కిలోలు ఇవ్వనున్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

WALK-IN-INTERVIEW
Join us Fantastic Functional Team to full fill your dreams.
• Sr.Marketing Executives • Telecallers • Office Boy
• Receptionist • Accounts Officer
• EXPERIENCED CIVIL ENGINEERS
Interview Dates : 18th, 19th, 20th Aug. @ 10 AM to 4 PM
BELL INFRA PROJECTS
Flat No. 103 & 106, 1st Floor, Sahasra Apartments
Bellary Road, ANANTAPUR.
Raketla Ramesh 9515514999
Bhumi Reddy Vishnuvardhan Reddy 9855584999

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

FREE EDUCATION
■ ఇంటర్ పాసైన స్టూడెంట్స్ కి B.Sc (నర్సింగ్) B.Sc (MLT), BPT (ఫిజియోథెరపీ) GNM (నర్సింగ్),DMLT (బ్లడ్ టెస్ట్) ఫ్రీ ఎడ్యుకేషన్ కాలేజీలో హాస్టల్ కలదు. సంప్ర : జి. మురళి. సెల్ : 9030661651, ATP. [A-1074]

బ్యూటీషియన్ కోర్స్
■ ఫీజు : 4,500/- AP-SBTET ద్వారా సర్టిఫికేట్ పాస్ అయిన వారికి, ప్రభుత్వ & ప్రైవేట్ జాబ్స్‌కి ఉపయోగం, Q : 10th పాస్, సీట్స్ : 5 మాత్రమే. లాస్ట్ డేట్ : సెప్టెంబర్ 4 (విత్‌అవుట్ ఫైన్) # సాయి ఇనిస్టిట్యూట్, 14/402, కమలానగర్, ATP. 9059723829. [A-776830]

P.C. MAINTENANCE COURSE
■ ఫీజు : 3,000/- రాయితీతో దరఖాస్తులు. AP-SBTET ద్వారా సర్టిఫికేట్ పొందిన వారికి గ్రూప్-2లో నాన్ ఎగ్జిక్యూటివ్ జాబ్స్‌కి, ఉపయోగము, లాస్ట్ డేట్ : సెప్టెంబర్ 4 (విత్‌అవుట్ ఫైన్) # సాయి ఇనిస్టిట్యూట్, 14/402, కమలానగర్, ATP. 9059723829. [A-776829]

PARAMEDICAL
■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1928]

DMLT ADMISSIONS
■ DMLT 2 సం॥ల కోర్స్ సీట్ల కొరకు అడ్మిషన్స్ జరుగుచున్నవి. కొన్ని సీట్లు మాత్రమే కలవు. Qlf : ఇంటర్ పాస్. అభినవ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ. ATP : 86399 74541 [V-6628]

REAL ESTATE

FLATS FOR SALE
■ నవయుగ ఎస్టేట్స్ వారి సమృద్ధి ప్రాజెక్ట్ నందు 3 BHK ఫ్లాట్స్ అమ్మకానికి కలవు. డిసెంబర్ లో Handover ఇవ్వబడును. సంప్ర : మారుతి నగర్ 2వ క్రాస్, గణేష్ హోటల్ వెనుక, అనంతపురము. సెల్ : 9440266241. [A-2706]

SERVICES

బంగారం కొనబడును
■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647 [V-6627.]

పట్టాదారు పాసుబుక్ పోయినది
■ కుమ్మతి శ్రీనివాస రెడ్డి S/o లేట్ K. నారాయణరెడ్డి నక్కలపల్లి (గ్రా), బెళుగుప్ప (మం), అనంతపురము జిల్లాకు చెందిన పట్టాదారు పాసుబుక్ & టైటిల్ డీడ్ ఖాతా నెం. 967 (సర్వే నెం: 17-2 B=5 A ; సర్వే నెం : 18-4 B లో 3.23 A ; సర్వేనెం : 19-4 B లో 1.65 A. మొత్తం: 9.88 A) దొరికినవారు అందజేయగలరు. [A-776833]

WANTED
■ విశాల్ మార్ట్, D. మార్ట్, రిలయన్స్ మార్ట్ నందు పార్ట్ టైం/ఫుల్ టైం జాబ్ కలవు. Contact : 8121661651, ATP. [A-2708]

■ వంపు బాయ్స్ కావలెను. ATP, ఆలమూరు రోడ్డు, Opp. సత్యసాయి కాలేజ్, పెట్రోల్ బంక్ నందు పనిచేయుటకు బాయ్స్ కావలెను. వర్కింగ్ గం॥లను బట్టి రోజుకు 800/-. సెల్ : 9441124313, 9703234171. [A-776834]

■ అనంతపురము టౌన్ లోని ప్రముఖ పాలిటెక్నిక్ కాలేజ్ కొరకు M.Sc మ్యాథ్స్, M.Sc కెమిస్ట్రీ, B.Tech/M.Tech - EEE & మెకానికల్ అధ్యాపకులు కావలెను. సెల్ : 8886621128, 8886621124, 8886621125. [A-2707]

■ JOB VACANCY: TIK PVT. LTD. Age: 18 to 45 yrs, Qul: 10th to Any Degree, Salary: 18000/- to 25000/- Contact: ✆ 7416332281. [T-774238]

■ డైరెక్ట్ జాబ్ 8th - PG చదివిన వారికి ఉద్యోగాలు ఫ్రీ రూం+భోజనం+ జీతం: 15-25 వేల వరకు. ఏజెంట్స్ కావలెను. ఫోన్ 9966340431 [H-788939]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్‌ను కలిసిన కలెక్టర్



మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ కోటేశ్వర రావుతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం టవర్‌క్లాక్: స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ పి.కోటేశ్వరరావును కలెక్టర్ గౌతమి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఆయన నగరంలోని పలు కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు.

ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి



ఈ క్రాప్ బుకింగ్ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

ఆత్మకూరు: ఖరీఫ్ సీజన్‌లో పంట సాగు చేసిన ప్రతి రైతూ పంటలను ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత తెలిపారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ సిబ్బందితో కలిసి వారు పర్యటించారు. ఏఓ మాట్లాడుతూ ఈ క్రాప్ బుకింగ్ చేయడం వల్ల రైతులకు పంట నష్టపోతే పరిహారం అందుతుందన్నారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు.

రామగిరి: మండలంలోని రైతులు ఈ-క్రాప్ నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ మురళీకృష్ణ గురువారం తెలిపారు. పంటలు సాగు చేసిన రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రాల్లో పంట నమోదు చేయించుకోవాలన్నారు.

చెన్నేకొత్తపల్లి: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులందరూ తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఏఓ ఉదయ్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన మండలంలోని మేడాపురంలో జరుగుతున్న ఈ క్రాప్ బుకింగ్‌ను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సాగుచేసిన పంటలను ఈ క్రాప్ బుకింగ్ చేసుకుంటేనే ప్రభుత్వం నుంచి పంటనష్ట పరిహారం జరిగితే పరిహారం అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓ మహిత తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ ఇన్ఫామ్ మ్యాక్ సంస్థ సభ్యుడికి సన్మానం



విశ్రాంత ఎస్పీ డాక్టర్ రాజశిఖామణిని సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు, ఎస్సీ సంఘాల నాయకులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: గ్లోబల్ ఇన్ఫామ్ మ్యాక్ సంస్థ సభ్యుడు, విశ్రాంత ఎస్పీ డాక్టర్ రాజశిఖామణిని విశ్రాంత ఉద్యోగులు, ఎస్సీ సంఘాల నాయకులు గురువారం సన్మానించారు. ఆయన్ను పోలీస్ కాంప్లెక్స్‌లోని అతిథి గృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి, సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీల అభ్యున్నతికి పాటు పడాలని పిలుపునిచ్చారు. సన్మాన కార్యక్రమంలో విశ్రాంత ఇండియా డిఫెన్స్ డైరెక్టర్ సతీష్‌కుమార్, విశ్రాంత డీసీఓ హెచ్.మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా కిశోర్‌రెడ్డి



దుబ్బ కిశోర్‌రెడ్డి

అనంతపురం టవర్ క్లాక్ /ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ రెడ్డి జేఏసీ (రెడ్డి ఐక్యవేదిక) అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా తనను రాష్ట్ర అధ్యక్షుడు విప్పల శివకుమార్‌రెడ్డి నియమించినట్లు ఆత్మకూరుకు చెందిన దుబ్బ కిశోర్‌రెడ్డి గురువారం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న విశాఖపట్నంలో 26 జిల్లాల రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుల ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. తన ఎంపికకు సహకరించిన జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేషాద్రిరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

20న నేత్ర చికిత్స శిబిరం

అనంతపురం సిటీ: స్థానిక సోమనాథ్‌నగర్‌లోని బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ భవన్‌లో ఈ నెల 20న నేత్ర చికిత్స శిబిరం నిర్వహించనున్నట్లు ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రాజశేఖరరెడ్డి, సర్కిల్ ప్రతినిధి సుభాన్, బ్రాంచ్ కార్యదర్శి హరినాథరెడ్డి గురువారం తెలిపారు. నేత్ర ఈఎన్‌టీ, ఐ కేర్ హాస్పిటల్ డాక్టర్లు కిరణ్ కుమార్, దివ్యశ్రీ పర్యవేక్షణలో క్యాంప్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు సెల్: 94402 88899/94411 66686/ 94411 66532 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జగనన్న మాటిచ్చారంటే చేస్తారంతే!

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి
- ఉప్పరపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ



విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు

రాప్తాడురూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చారంటే కచ్చితంగా అమలు చేస్తారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. గురువారం అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మతో కలిసి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో ఈ ప్రాంత రైతులు, నివాసాలకు నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత సంపద సృష్టిస్తున్నారన్నారు. వ్యవసాయం విస్తరిస్తోందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏడాదిలో 50 వేల విద్యుత్ కనెక్షన్లు ఇస్తే, ఇప్పుడు జిల్లాలో 20 వేల కనెక్షన్లు ఇచ్చామన్నారు.

రైతులకు ప్రభుత్వం అండగా ఉంటోంది..

రాష్ట్ర ప్రభుత్వం రైతుకు అండగా ఉంటోందని ఎమ్మెల్యే అన్నారు. అట్టడుగు వర్గాల వారిని రైతులుగా మార్చిన ఏకైక ప్రభుత్వం అన్నారు. నగర చుట్టుపక్కల పల్లె ప్రాంతాలన్నీ పట్టణీకరణ చేస్తున్నామన్నారు. పరిటాల తరం కానిది పేరూరు డ్యామ్‌కు నీళ్లిచ్చి నిరూపించామన్నారు. గత చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్పగా పరిపాలన సాగిస్తున్నారన్నారు. అభివృద్ధిలో గత ప్రభుత్వాలకంటే చాలా ముందు ఉన్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజల వద్దకు వెళ్లి ధైర్యంగా ఓట్లు అడిగేలా చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సావిత్రి శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజీ చైర్మన్ నాగేశ్వరెడ్డి, ఎంపీపీ గుజ్జల వరలక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, వైస్ ఎంపీపీ చియ్యేడు కృష్టారెడ్డి, నాయకులు ధనుంజయయాదవ్, స్థానిక నాయకులు రాజారెడ్డి, ఆనందప్ప, రవిశేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకటేశు, నారాయణరాజు, అంజి, సానే శీనా, రాము తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణం కావాలి

- నగరంలోని కూడళ్లను పరిశీలించిన ఎస్పీ శ్రీనివాసరావు



అనంతపురం పాతూరు బస్టాండ్ కూలిలో సూచనలు చేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: జిల్లా కేంద్రంలో వాహనాల రాకపోకలు సులువుగా సాగేందుకు అవసరమైన చర్యలు కోసం జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు పలు కూడళ్లలో గురువారం పర్యటించారు. స్థానిక రుద్రంపేట, కళ్యాణదుర్గం బైపాస్, బళ్లారి బైపాస్, తపోవనం, నడిమివంక, క్లాక్ టవర్, సప్తగిరి సర్కిల్, సూర్యానగర్ సర్కిల్, గాంధీబజార్, తాడిపత్రి బస్టాండ్, శ్రీకంఠం సర్కిల్, తదితర కూడళ్లు, ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌ను పరిశీలించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. జిల్లా ఎస్పీతో పాటు ట్రాఫిక్ సీఐ వెంకటేష్‌నాయక్, వన్ టౌన్ సీఐ రెడ్డప్ప తదితరులు ఉన్నారు.

సీజింగ్ పేరుతో దౌర్జన్యం

- పెట్రేగిపోతున్న ప్రైవేట్ ఫైనాన్స్ ఏజెన్సీల ఆగడాలు
- కంతులు పెండింగ్ ఉన్నాయని బైకులు లాక్కెళ్లిన వైనం

రాప్తాడురూరల్: అనంతపురం నగరం, రూరల్ పరిధిలో ఉన్న ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల ఏజెన్సీల ఆగడాలు మితిమీరుతున్నాయి. వాహనాల సీజింగ్ పేరుతో దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. ఫైనాన్స్‌లో తీసుకున్న వాహన కంతులు సక్రమంగా చెల్లించకపోతే ముందుగా నోటీసులు ఇవ్వాలి..లేదా సమాచారం ఇవ్వాలి.. కానీ ముందస్తు సమాచారం ఇవ్వకుండా, నోటీసులు ఇవ్వకుండా వాహనదారులు ఎక్కడ కనిపిస్తే అక్కడే దౌర్జన్యంగా వాహనాలను లాక్కుపోతున్నారు. ఈ ఏజెన్సీలైతే కొందరు రౌడీలను పెట్టుకొని దందాలు చేస్తున్నారు.

- యాడికి మండలానికి చెందిన కానిస్టేబుల్ బైకును బలవంతంగా లాక్కొని గోడౌన్‌కు తీసుకెళ్లారు. దీనిపై బాధితుడు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాలుగు రోజుల కిందట కనగానపల్లి మండలం గుంతపల్లి చెందిన రైతు బయపరెడ్డి ద్విచక్ర వాహనాన్ని ఎలాంటి సమాచారం ఇవ్వకుండా లాక్కున్నారు. ఫైనాన్స్ కంతులూ అన్నీ చెల్లించానని బాధితుడు ఆవేదన చెందుతున్నాడు. కంతులన్నీ చెల్లించినా కూడా రెండు కంతులు ఆలస్యంగా చెల్లించాడనే కారణంతో రూ. 22 వేలు బాకీ ఉన్నావంటూ ఏజెన్సీ సిబ్బంది దౌర్జన్యంగా బండి తీసుకెళ్లారని వాపోయాడు. బాధితుడు గురువారం రూరల్ పోలీసులను కలిసి ఫిర్యాదు చేశాడు. కాగా సీజింగ్ పేరుతో రైతులు, ప్రజలపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని పలువురు వాపోతున్నారు. కమ్యూనిస్ట్ పార్టీ విద్యార్థి సంఘం పేరు చెప్పుకుంటూ ఓ వ్యక్తి, తెలుగుదేశం విద్యార్థి సంఘం పేరు చెప్పుకుంటూ మరో వ్యక్తి ఏజెన్సీలు నడుపుతున్నారని తెలిసింది.

రాయితీపై ప్రత్యామ్నాయ విత్తనాలు

చెన్నేకొత్తపల్లి: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ప్రత్యామ్నాయ పంట సాగుకు ఉలవలు, రాగులు, పెసర, అలసంద విత్తనాలను 80శాతం రాయితీపై అందిస్తున్నట్లు ఏఓ ఉదయ్ కుమార్ తెలిపారు. అవసరమైన రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు.

కరువు దుర్భిక్ష పరిస్థితులు తెలుసుకోవాలి



అనంత కరువు పుస్తకాలను గ్రంథాలయానికి అందిస్తున్న రచయితలు,కవులు

అనంతపురం కల్చరల్: గతంలో జిల్లాలో కరువు విలయతాండవం చేసిందని, ఎంతో మంది రైతులు ప్రాణాలు పోగొట్టుకున్నారని గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమ అన్నారు. గురువారం కేంద్ర గ్రంథాలయానికి ఉమాదేవి పరిశోధన గ్రంథం 'అనంత కరువు– ఇనుపగజ్జెల తల్లి' పుస్తకాలను రచయితలు, కవులు అందించారు. ఎల్ఎం ఉమ, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్ఎం మోహన రెడ్డి మాట్లాడుతూ అనంత కరువు పుస్తకాన్ని వెలుగులోకి తెచ్చిన చెట్ల ఈరన్నను అభినందించారు. అనేక దశాబ్దాల పాటు కరువు పరిస్థితులు జిల్లాను అతలాకుతలం చేశాయన్నారు. అయితే వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో ప్రణాళికబద్ధంగా రైతాంగాన్ని ఆదుకున్నారని గుర్తు చేశారు. అలాగే ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కరువు మాట వినిపించకుండా ప్రజాసంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. ఆ రోజుల్లో అనేక కరువు యాత్రలు, కరువు పరిస్థితులపై అనేక కథలు, నవలలు వచ్చి జనాన్ని చైతన్యం చేశాయన్నారు. ఆ సందర్భంలో ఆచార్య రాచపాలెం చంద్రశేఖరెడ్డి పర్యవేక్షణలో వచ్చిన 'అనంత కరువు– ఇనుపగజ్జెల తల్లి' పుస్తకంపై చక్కటి పరిశోధన జరిగిందన్నారు. ఈ పుస్తకాలను అన్ని శాఖా గ్రంథాలయాల్లో లభ్యమయ్యేట్లు చూస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ రచయితలు డాక్టర్ పతికి రమేష్ నారాయణ, రియాజుద్దీన్, నాగరాజు, కమలనాథ్, రమేష్‌తో పాటూ గ్రంథాలయ అధికారిణి సుబ్బరత్నమ్మ, శివశంకర్,ఇంతియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అథ్లెటిక్స్ మీట్



అథ్లెటిక్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారిణులు

అనంతపురం: రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్డీటీ) అభివృద్ధి కోసం స్పోర్ట్ ఫర్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెక్టార్ ఏరియా స్థాయి గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ మీట్ ముగిసింది. ఈ అథ్లెటిక్స్ మీట్‌లో ఆర్డీటీ బుక్కరాయసముద్రం, బత్తలపల్లి, కదిరి, కళ్యాణదుర్గం, ఉరవకొండ, మడకశిర, శ్రీశైలం, ఆదోని ప్రాంతాల్లోని 409 పాఠశాలల విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ పోటీలు జూలై 18న ప్రారంభమై ఆగస్టు 17న ముగిశాయి. 100 మీటర్లు, 200మీ, 400 మీ, 4 ☓100 మీటర్ల రిలే పరుగు, లాంగ్ జంప్, షాట్‌పుట్‌తో సహా ఆరు విభిన్న విభాగాల పోటీల్లో యూ–15కి చెందిన 3,600 మందికిపైగా బాలికలు ఏరియా స్థాయిలో పాల్గొన్నారు. ఏరియా స్థాయి గ్రామీణ అథ్లెటిక్స్‌లో అర్హత సాధించిన క్రీడాకారులు ఆగస్టు 27 నుంచి 29వ తేదీ వరకూ అనంతపురం క్రీడా గ్రామంలో కేంద్ర స్థాయిలో జరిగే క్రీడల్లో పోటీపడనున్నారు.

క్రీడల్లో భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడమే లక్ష్యం..

అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ డైరెక్టర్, సాయి కృష్ణ మాట్లాడుతూ 2007లో ప్రారంభమైన గ్రామీణ బాలికల అథ్లెటిక్స్, క్రీడల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో బాలికల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంతోపాటు అవుట్ డోర్ స్పోర్ట్స్‌లో పాల్గొంటున్న అమ్మాయిల చుట్టూ ఉన్న లింగ వివక్షను తగ్గించడమే లక్ష్యమన్నారు. గతంలో మాదిరిగానే, తాము పాఠశాలల నుంచి అద్భుతమైన స్పందనను చూశామన్నారు.

స్పోర్ట్స్ అకాడమీ గ్రాస్ రూట్ కోఆర్డినేటర్ వంశీ కృష్ణ మాట్లాడుతూ తాము ఏరియా స్థాయి నుంచి అర్హత పొందిన అథ్లెట్లందరికీ ఆతిథ్యం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కేంద్ర స్థాయి కేవలం క్రీడా కార్యక్రమం మాత్రమే కాకుండా క్రీడల్లో బాలికల వేడుకగా ఉంటుందన్నారు. నేర్చుకోవడాన్ని సులభతరం చేసే, సమగ్రతను ప్రోత్సహించేలా వివిధ కార్యకలాపాలు ఏర్పాటు చేశామన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

- డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి సాహిత్య



సీనియర్ జర్నలిస్టు బాబాసాహెబ్‌ను సన్మానిస్తున్న డిప్యూటీ మేయర్లు

అనంతపురం టవర్ క్లాక్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య పేర్కొన్నారు. గురువారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం నిర్వహించా రు. ముందుగా ఏపీయూడబ్ల్యూజే పతాకాన్ని ఆవిష్కరించారు. డిప్యూటీ మేయరు కోగటం మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ అభివృద్ధి, ప్రెస్‌క్లబ్‌కు అవసరమైన పార్కింగ్ ప్లేస్, ఇళ్ల స్థలాల కోసం స్థల సేకరణకు కృషి చేస్తామన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చేపట్టే కార్యక్రమాల్లో తాను ముందు ఉంటానన్నారు. మాజీ సైనిక ఉద్యోగులకు ఇచ్చే విధంగా హౌస్ ట్యాక్స్‌లో జర్నలిస్టులకు మినహాయింపు ఇచ్చేలా కౌన్సిల్‌లో తీర్మానం చేస్తామని హామీ ఇచ్చారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య మాట్లాడుతూ సమాజం పట్ల జర్నలిస్టుల కృషి ఎనలేనిదన్నారు. కార్పొరేషన్ పరిధిలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జర్నలిస్టులు సమాజంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారన్నారు. ఏపీయూడబ్ల్యూజే 67వ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం జిల్లాలోని 25 మంది వెటరన్, రిటైర్డ్, సీనియర్ జర్నలిస్టులకు డిప్యూటీ మేయర్లు చేతులమీదుగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు, సీనియర్ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

మంచి సినిమాకు ఆదరణ తగ్గదు

- సినీ నటుడు కార్తికేయ



విలేకరులతో మాట్లాడుతున్న హీరో కార్తికేయ

అనంతపురం కల్చరల్: మంచి సినిమాను ప్రేక్షకులు ఎపుడూ ఆదరిస్తారని హీరో కార్తికేయ పేర్కొన్నారు. ఆయన హీరోగా నటిస్తున్న 'బెదురులంక 2012' సినిమా ఈనెల 25న విడుదలవుతోంది. ఈనేపథ్యంలో నగరానికి వచ్చిన హీరో కార్తికేయ మాసినేని గ్రాండ్ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో విశేషాలు పంచుకున్నారు. 2012 సంవత్సరంలో యుగాంతం వస్తుందన్న పుకార్ల నేపథ్యంలో పూర్తి వినోదం, హాస్యం కలగలిపి తీసిన సినిమా అందరికీ నచ్చుతుందన్న విశ్వాసం వెలిబుచ్చారు. గతంలో తాను ఆర్ఎక్స్ 100 సినిమా విడుదల సందర్భంగా అనంతకు వచ్చినని, అప్పట్లో చూపిన ఆదరణ ఇప్పుడు కూడా చూపిస్తున్న అనంత వాసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గతంలో నటించిన సినిమాల వైరుధ్యాలపై వివరిస్తూ కేవలం హీరోగానే కాకుండా అన్ని రకాల పాత్రలు పోషిస్తున్నానన్నారు. ప్రేక్షకులకు నచ్చే విధంగా ఈ చిత్రంలో కూడా పాత్ర ఆకట్టుకుంటుందన్నారు. హీరోతో అభిమానులు సెల్ఫీలు దిగడానికి ఎగబడడంతో మాసినేని గ్రాండ్ వద్ద సందడి నెలకొంది.

'డ్యాన్స్'లో శ్రీవైష్ణవికి జాతీయ స్థాయి అవార్డు



శ్రీవైష్ణవిని అభినందిస్తున్న ఏజీఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ తబస్సుమ్

రాప్తాడురూరల్: అనంతపురం కోర్టురోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాల 9వ తరగతి విద్యార్థిని శ్రీ వైష్ణవి డ్యాన్స్ పోటీల్లో జాతీయ స్థాయి అవార్డు దక్కించుకుంది. హైదరాబాద్‌లో కల్చరల్ అండ్ ఫైన్ ఆర్ట్స్ నిర్వహించిన డ్యాన్స్ పోటీల్లో జాతీయ స్థాయిలో బృంద డ్యాన్స్ విభాగంలో ప్రథమ బహుమతి, సోలో డ్యాన్స్ విభాగంలో ద్వితీయ బహుమతి కైవసం చేసుకుంది. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏజీఎం సుబ్బారెడ్డి విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుమ్, వైస్ ప్రిన్సిపాల్ బాలకృష్ణ, కోఆర్డినేటర్ శ్రీనివాసులు, డీన్లు మహేష్, అప్పలనాయుడు, సిరాజుద్దీన్, ఏఓ గోపాల్ పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో మహిళ మెడలోని గొలుసును గుర్తు తెలియని యువకుడు అపహరించుకుపోయాడు. చీరల వ్యాపారం చేసుకునే పార్వతి పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలో నడిచి వెళ్తుండగా గుర్తు తెలియని యువకుడు వెంబడించి గొలుసు లాక్కెల్లాడు. బాధిత మహిళ గట్టిగా కేకలు వేసింది. అయితే ఎత్తుకెళ్లింది గిల్టు నగలు కావడంతో పోలీసులకు మొదట ఫిర్యాదు చేయాలనుకోలేదు. ఈ విషయం పోలీసులకు ఆలస్యంగా తెలియడంతో ఆమెను విచారించి, చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తి ఆనవాళ్లను తెలుసుకునే ప్రయత్నం చేశారు. బాధితురాలితో ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేశారు.

విశ్రాంత డీఈఓ ఆకస్మిక మృతి



జనార్దనాచార్యులు (ఫైల్)

రాప్తాడురూరల్: జిల్లా విశ్రాంత విద్యాశాఖ అధికారి ఎం.జనార్దనాచార్యులు గురువారం ఉదయం బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. ఈయన 2017 నుంచి 2019 వరకు రెండేళ్ల పాటు జిల్లాలో డీఈఓగా పని చేశారు. 2019 మే 30న ఇక్కడి నుంచి నెల్లూరుకు బదిలీ అయ్యారు. అక్కడ ఏడాది పాటు పని చేసి, పదవీ విరమణ పొందారు. ప్రస్తుతం ఆయన కుటుంబం హైదరాబాదులో ఉంటోంది. బుధవారం ఉదయం ఫిట్స్ రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆయన్ను ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతుండగా బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కన్నుమూశారు. జిల్లాలో రెండేళ్ల పాటు పని చేసినా మంచి అధికారిగా గుర్తింపు పొందారు. అందరినీ కలుపుకొనిపోయే అధికారిగా మన్ననలు పొందారు. జనార్దనాచార్యులు మృతిపై జిల్లాలో విద్యాశాఖ కార్యాలయ ఉద్యోగులు, సమగ్రశిక్ష ఉద్యోగులు, ఎంఈఓలు, హెచ్ఎంలు, ప్రైవేట్ విద్యా సంస్థల కరస్పాండెంట్లు విచారం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. జనార్దనాచార్యులుకి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తి చేయండి

రాప్తాడు: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద జగనన్న కాలనీల్లో నిర్మించిన ఇళ్ల వద్ద ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తి చేయాలని నోడల్ ఆఫీసర్ ఉమామహేశ్వరమ్మ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సాల్మన్‌తో కలిసి ఆమె జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో నిర్మించిన 224 ఇళ్లకు తాత్కాలిక డ్రైనేజీ అవసరాల కోసం ఇంకుడు గుంతల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. జాతీయ ఉపాధిహామీ నిధుల ద్వారా ఒక్కో ఇంకుడు గుంత నిర్మాణానికి రూ.6 వేల ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏపీఓ సావిత్రి, ఏఓ వెంకటేశ్వర ప్రసాద్, ఈసీ మురళీ, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులే కళాశాలకు బ్రాండ్ అంబాసిడర్లు



1962-67 బ్యాచ్ పూర్వ విద్యార్థులతో వీసీ జింకా రంగజనార్దన

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థులే ప్రస్తుత విద్యార్థులకు బ్రాండ్ అంబాసిడర్లు అని వీసీ జింకా రంగజనార్దన అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల (1962–67 బ్యాచ్) (ఐదేళ్ల ఇంజినీరింగ్ కోర్సు) విద్యార్థులు గురువారం కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సహకారం ఎప్పటికీ మరువలేనిదన్నారు. పి.మునికృష్ణ ,(పరాశక్తి సిమెంట్ హైదరాబాద్) వారి సహకారం ఎంతో తోడ్పాటు అందించిందన్నారు. రాబోవు కాలంలో పూర్వ విద్యార్థుల సహకారంతో కళాశాలను మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు. పూర్వ విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు దిశా నిర్దేశం చేయాలన్నారు. అనంతరం వీసీని, పూర్వ విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పి. మునికృష్ణ, ఎంఆర్ రమేష్, పి.రఘునాథ రావు, కే భాస్కర్ రెడ్డి, వరదాచార్యులు, ఇంద్రసేనా రెడ్డి, పి.శ్రీనాథ్, సతీష్‌కుమార్, సి.చంద్రశేఖరయ్య, రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్, డైరెక్టర్లు ప్రొఫెసర్ పి. సుజాత, ప్రొఫెసర్ బి. దుర్గాప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరుణాకాంతి, ఎలక్ట్రికల్ విభాగాధిపతి డాక్టర్ ఎం.రామశేఖర్ రెడ్డి, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి డాక్టర్ చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల వివరాలు నమోదు చేసుకోవాలి



కొడిమిలో పంటను పరిశీలిస్తున్న ఏడీఏ రవి

రాప్తాడురూరల్: ప్రత్యామ్నాయ పంటల సాగు వివరాలు రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని వ్యవసాయ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.రవి సూచించారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా పెసర,అలసంద, ఉలవ విత్తనాలు 80శాతం సబ్సిడీతో అందిస్తోందన్నారు. గురువారం అనంతపురం రూరల్ మండలం కొడిమి, తాటిచెర్ల గ్రామాల్లో ఆయన పర్యటించారు. పంట నమోదు ప్రక్రియను పరిశీలించి, ఆవశ్యకతను రైతులకు వివరించారు. ఏఓ శశికళ, కొడిమి సర్పంచ్ సుబ్బిరెడ్డి, గ్రామ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తిరుపాల్‌రెడ్డి, ఏఈఓ ప్రసాద్, వీహెచ్ఏ రాజేశ్వరి, లోకేశ్వరి ఉన్నారు.

IN THE COURT OF THE IST ADDL. DISTRICT JUDGE, ANANTHAPURAMU
A.S.No:13/2023
Between :
1) Raghavendra Rao & Another ..... Appellants/ Defendents 3 & 4
and
1) Smt. Rajya Lakhmi & 3 Others ... Respondents/ Plaintiff / D2, 5 & 6
Notice to Respondent No. 2 & 4
To, R2 : Gayathri D/o Late Kesava Rao
R4 : D.Sivananda Rao S/o Late D.Venkata Ramana Rao, Both are R/at D.No:10-340, Adimurthy Nagar, Ananthapuramu.
పై నెంబరు దావాలోని 2 మరియు 4వ ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తం పై కోర్టువారు 08-09-2023 వ తేది నాదు వాయిదా వేసినారు. కావున ఆ రోజు ఉదయం 10-30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు అని తెలియ చేయడమైనది.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
DESAI SUBRAMANYAM, Advocate
Ananthapuramu, Cell No : 9704672985

IN THE COURT OF THE IST ADDL. DISTRICT JUDGE, ANANTHAPURAMU
I.A.No:163/2023 in A.S.No:13/2023
Between :
1) Raghavendra Rao & Another ..... Appellants/ Defendents 3 & 4
and
1) Smt. Rajya Lakhmi & 3 Others ... Respondents/ Plaintiff / D2, 5 & 6
Notice to Respondent No. 2 & 4
To, R2 : Gayathri D/o Late Kesava Rao
R4 : D.Sivananda Rao S/o Late D.Venkata Ramana Rao, Both are R/at D.No:10-340, Adimurthy Nagar, Ananthapuramu.
పై నెంబరు దావాలోని 2 మరియు 4వ ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తం పై కోర్టువారు 08-09-2023 వ తేది నాదు వాయిదా వేసినారు. కావున ఆ రోజు ఉదయం 10-30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు అని తెలియ చేయడమైనది.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
DESAI SUBRAMANYAM, Advocate
Ananthapuramu, Cell No : 9704672985

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AND J.M.F.C AT PAVAGADA
MC.No. 59/2022
Petitioner : Raviteja.R S/o Ramasubba Reddy, aged about 34 years, R/o Yella Reddy Street, P.Roppa Village and Post, Pavagada Taluk and Tumakuru Dist.
--V/s--
Respondent : Tejaswini W/o Raviteja, aged about 26 years, R/at Yuvajana Colony, Somanath Nagar, Near Thapovanam, Ananthapuram Town and Dist. Now W/at PHC Kallumari, Madakasira Taluk, Sri Sathya Sai Dist., Andhra Pradesh.
PAPER PUBLICATION
WHEREAS, the petitioner has filed the above petition for decree of divorce, now the matter is set down for issue notice / suit summons to respondent and you got any objections over the above said petition or if you are interested to adjudicate the above said matter as a respondent and may prosecute the same on the date of hearing i.e., 28-8-2023.
You are hereby called upon to appear before this Hon'ble court at 11.00 A.M. on the said date of hearing either in person or through your counsel. If you fail to appear before this Hon'ble court, the matter will be heard and decided ex-parte.
By Order
Advocate for petitioner
V. Sreerama Manjunatha PR Advocates, PAVAGADA
SHIRATEDAR Senior Civil Judge Court J.M.F.C. PAVAGADA.

బహిరంగ ప్రకటన
[illegible]
ఫోన్ : 94408 57943

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనంతపురము డివిజన్
9912220719, 9912220732, 9912220724,
9010223702, 9010567770, 9010588846, 9912220727